
## సింగిల్ పేజీ కథ




అర్ధరాత్రి దాటింది. కరెంటు పోతోంది, వస్తోంది. వేసవికాలం కాదు. కరెంటు కోతలేదు. దొంగలకు అనుకూలంగా తీస్తున్నారో? అదీ అర్థం కాలేదు.

ఫ్యానుగాలికి అలవాటుపడ్డ ప్రాణం నిద్ర పోనివ్వడం లేదు. దోమలు సంగీతం వినిపించకుండానే కుడుతున్నాయి. ఆలోచనలతో అటు ఇటు దొర్లుతుంటే తలకింద దిండు కింద పడింది. దిండు కవరులో దాచిన యాభై వేలల్లో నుండి కొన్ని నోట్లు కింద పడ్డాయి. చిందర వందరగా పడిన నోట్లను సెల్‌ఫోన్‌లోని లయిటు వెలిగించి ఏరి లెక్క సరిచూసుకున్నాను. రబ్బరు బ్యాండు వేసి భద్రంగా దిండుకవరులో పెట్టాను.

ఈ యాభైవేలు రేపు కోర్టులో కట్టాలి. నా మంచితనం ఎందుకూ కొరగానిది అయింది. నేను నమ్మిన నమ్మకం ఎదుటివాళ్ళకు అపనమ్మకం కలిగించింది. అబద్ధాలు చెప్పని నేను అవసరము కోసం అబద్ధాలు చెపుతున్నానేమో అని అనుమానం కలిగిస్తుంది.

రోజు మనది కాకపోతే తాడే పామై కరుస్తుందట అలా ఉంది నా పరిస్థితి. ఎందరికో సహాయం చేసాను. నేనూ వాళ్ళ నుండి సహాయం పొందాను. కాని ఎటువంటి రాతకోతలు లేవు. తేడాలు లేనేలేవు. మాట నమ్మకం మీదే సాగిపోయింది.

కాలం ఎప్పుడూ ఒకే రీతిగా సాగదుకదా! బండ్లు ఓడలు అవుతాయి ఓడలు బండ్లు అవుతాయి. మన చేతిలో డబ్బు లేదని అవసరాలు ఆగవు. పాతిక వేలు కావలసి వచ్చింది. తెలిసినవాళ్ళను అడిగాను ముఖం చాటు చేసుకున్నారు. బంధువులను అడిగాను మాట దాటవేస్తున్నారు. డబ్బులా? అవసరం. కొంతమంది నూటికి పది రూపాయలు వడ్డీ అన్నారు. బంగారం ఉందా? ...ఇంటి కాగితాలు ఉన్నాయా? ...మీ పిల్లలు కూడా సంతకాలు పెట్టాలి... మీతోపాటు పని చేసే మరో ఉద్యోగి హామీ ఉండాలి చూసుకోండి అని చెప్పారు. అన్నింటికి తల ఊపినా ఇస్తాం... ఇస్తాం... అన్నవాళ్ళే కాని ఇచ్చిన వాళ్ళు లేరు. డబ్బులు ఇచ్చి పుచ్చుకొనె వ్యవహారం అంతా ఆయనే చూసుకొనేవారు. నాకు ఏమీ తెలియదు. సమయానికి ఇంట్లో డబ్బులు లేకపోతే నా నగలే ఇచ్చేదాన్ని. ఈ రోజు నా అవసరానికి ఎవరు ఉపయోగపడటం లేదు.

"మీ లాంటి వాళ్ళకు డబ్బులు ఎవరు ఇవ్వరు. ఎందుకంటే ప్రతి ఒక్కరు మీ నుండి సహాయం పొందినవాళ్ళే. మీ వారా... తీరుగా, మిమ్మల్ని గట్టిగా అడగలేరు. అందువల్ల వాళ్ళు ఏమి సమాధానం చెప్పలేకపోతున్నారు. నాకు తెలిసిన వడ్డీవ్యాపారి ఉన్నాడు రేపు మీ దగ్గరకు తీసికొని వస్తాను" అన్నాడు నాకు తెలిసిన మాధవరావు.

మరునాడు అతనిని తీసుకొని వచ్చి "ఇతని పేరు రామారావు" అని పరిచయం చేసాడు.

"ఎంత కావాలి?" అని అడిగాడు రామారావు.

"పాతికవేలు చాలు" అన్నాను నేను.

"లక్ష రూపాయలకు తక్కువ ఇవ్వను ఎవ్వరికి. మీకు కూడా లక్ష రూపాయలు ఇస్తాను. చిన్న చితక బాకీలు ఉంటే తీర్చుకోండి" అన్నాడు. ఇదేదో బాగుందని -

"సరే" అన్నాను.

ఎదుటివారి బలహీనతలతో ఆడుకోవడంలో ఆరితేరినవాడని గ్రహించలేకపోయాను. రెండు ప్రాంసరీ నోట్లు రెండు ఖాళీ చెక్కులు తీసుకొని "నా దగ్గర పదిహేనువేలు ఉన్నాయి. మిగిలినది రెండు రోజుల్లో ఇస్తాను" అన్నాడు రామారావు.

"అయితే నోటులో పదిహేనువేలు అని వ్రాస్తాను" అన్నాను.

"నోటుపై వద్దు చెక్కులో ముప్పై వేలు అని రాయండి. అందరూ ఇలాగే ఇచ్చినదానికి రెట్టింపు రాయించుకుంటారు" అంటూ రెండు నోట్లు చెక్కులు తీసుకున్నాడు. ఇదిగో ఇస్తాను అదిగో ఇస్తాను అంటూ కొరవ డబ్బు ఇవ్వలేదు.

తీసుకున్న పదిహేనువేలు నాలుగు నెలల తరువాత ఇచ్చివేసాను. ఒక ఖాళీ చెక్కు నోటు తిరిగి ఇస్తూ "మిగిలిన కాగితాలు ఇల్లు మారడంలో ఎక్కడో పడిపోయాయి. మా అమ్మలాంటి మిమ్మల్ని మోసం చేస్తానా?" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు.

డబ్బు ఇచ్చివేసానన్న ధీమాతో మిగిలిన వాటి గురించి పట్టించుకోలేదు. ఇచ్చిన కాగితాలు జాగ్రత్త చెయ్యలేదు. ఇదంతా జరిగిన సంవత్సరం తరువాత కోర్టు నుండి రెండు నోటీసులు వచ్చాయి. ఒకటి యాభై వేలు వడ్డీ ఇవ్వాలని సివిల్ కేసు. మరొకటి ముప్పై వేలు వడ్డీ ఇవ్వాలి అని క్రిమినల్ కేసు. ఆ రోజు రామారావు నవ్విన నవ్వులో ఎంత కుట్ర దాగివుందో నాకు అప్పుడు అర్థమైయింది.

నేను చెప్పిన విషయాలు అన్ని విని లాయర్‌గారు నవ్వారు. నవ్వరా మరి! నేను చదువు లేనిదాన్నికాను గదా! పది మందికి పాఠాలు చెప్పే పంతులమ్మను. పోనీ చిన్నదాన్నా లోకం పోకడ తెలియనిదాన్నా? రేపో మాపో రిటైర్ కాబోతున్నాను. ఎటువంటి సమస్యకైనా చిటికెలో పరిష్కారం చెప్పగల సమర్థురాలిని. కాని ఊబిలో పడిపోయాను.

మొదటిసారిగా కోర్టు ఆవరణలో ప్రవేశించాను. సిగ్గు, భయం, వేదనతో నన్ను నేను నిందించుకున్నాను. నా లాంటివాళ్ళు రామారావు ఖాతాలో చాలా మంది ఉన్నారని తెలుసుకున్నాను. అతని వృత్తి ఇలా జనాన్ని మోసం చేయడమే.

నాకు తెలిసినవాళ్ళు, నా దగ్గర చదువుకొని పోలీసులు, లాయర్లుగా అయినవాళ్ళు ఎన్నాళ్ళు తిరిగినా లాభం లేదని, కంటికి కనపడేదే న్యాయం అని మన నిజాయితి ఎందుకూ కొరగానిది అని, రెంటికి కలిపి వడ్డీతో సహా లక్షకు పైగా చెల్లించవలసి వస్తుందని. ఎంతో కొంత ఇస్తానని మధ్యవర్తి ద్వారా రాజీ పడమని సలహా ఇచ్చారు. యాభై వేల రూపాయలు తీసుకొని రెండు కేసులు రద్దు చేసుకోవడానికి రామారావు అంగీకరించాడు.

ఒక నిరపరాధి శిక్షింప పడగూడదు అంటారు. అన్యాయంగా డబ్బు చెల్లించవలసి వచ్చింది. సాక్షాలు లేవు. రుజువులు లేవు. కోర్టు బంట్రోతులకు, గుమాస్తాలకు అక్కడ ఉండే పోలీసులకు లాయర్లకు రామారావు నిజాయితి తెలుసు అయినా తేలు కుట్టిన దొంగల్లా ఎవరి వాటాలు వారు పొందుతారు. ఒకే విధమైన కేసులు ఒకే వ్యక్తి బాధితులు ఎవరిది న్యాయమో ఎవరు మోసపోతున్నారో, ఎవరికి న్యాయం జరుగుతుందో న్యాయాధికారి గుర్తించలేరా? గుర్తించినా తమ పని తాము నిజాయితిగా నిర్వహిస్తున్నాం అనుకుంటారేమో...

ఇది నా అలసత్వానికి, అజ్ఞానానికి, అజాగ్రత్తకు ఏదో తెలియని అహంకారానికి అమాయకత్వానికి నా చేతులారా విధించుకున్న జరిమానా... జరిమానా.